


ఆక్రమణలు తొలగించాలి

పట్టణ పౌర సంక్షేమ సంఘం డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని అయ్యప్పనగర్‌లో సర్వే నెంబర్ 136లో గెడ్డ ను ఆక్రమించి అక్రమంగా వాటర్ ప్లాంట్ వ్యాపారం చేస్తున్న స్వాతీ ప్యూర్‌ఫైర్ వాటర్ ప్లాంట్ యాజమాన్యంపై చర్య తీసుకోవాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం కార్యదర్శి రెడ్డి శంకర్రావు, విజయనగరం అపార్ట్ మెంట్స్ అండ్ కాలనీస్ అసోసియేషన్ నాయకులు యుఎస్ రవికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం స్పందనలో కలెక్టర్‌కు వినతి అందజేశారు. గత 10 ఏళ్లుగా గెడ్డ ను సుమారు 500 గజాలు పైనా అక్రమించినాప్పటికి నేటి వరకు రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోలేదని అన్నారు. కబ్జాకు గురైన భూమిని సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు, కార్యక్రమంలో సిఐటియు నగర కార్యదర్శి వి.రమణ , అధ్యక్షుడు ఎ. జగన్ మోహన్ పాల్గొన్నారు.

స్వాతంత్ర్య వచ్చెననీ సభలేచేసి సంబర పడగానే సరిపోదోయీ.... అన్నాడు మహా కవి శ్రీశ్రీ. సాధించినదానికి సంతృప్తి చెంది... అదే విజయమనుకుంటే సరిపోదోయి... అని కూడా హెచ్చరించాడు. అచ్చంగా ఆ పాటను గుర్తుచేస్తోంది నేటి సమాజం. ఈ విషయంలో మన జిల్లాలో పరిస్థితులూ తీసిపోలేదు. ఏటా స్వాతంత్ర్య వేడుకల హంగామా తప్ప, దాన్ని స్ఫూర్తిగా తీసుకుని అభివృద్ధికి, అంతరాలను అంతమొందించేందుకు తగినంతగా కృషి జరగడం లేదు. శ్రీశ్రీ తన పాటలో చెప్పినట్టు కులమత, భేదాలు, వ్యక్తిగత స్వార్థ రాజకీయాలే ఇందుకు కారణం. ఫలితంగా జిల్లాలో జీవన ప్రమాణాలు పెరగడం లేదు. స్వాతత్ర్యం వచ్చి 76ఏళ్లు కావచ్చినా ఇప్పటికీ చదువును కొనుక్కోవాల్సిన పరిస్థితి వచ్చింది.



నాగావళి నదిలో తెప్పపై బాలికను తరలిస్తున్న గిరిజనులు

- ఆకాశం అందుకునే ధరలొకవైపు
- అదుపులేని నిరుద్యోగమింకోవైపు
- కొనసాగుతున్న కుల, మత భేదాలు
- పెచ్చుమీరుతున్న పదవీ వ్యామోహాలు
- నేటికీ అభివృద్ధికి నోచుకోని గ్రామాలెన్నో

స్వాతంత్ర్యం వచ్చెనని సంబర పడగానే సరిపోదోయి..

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

అక్షరాస్యతలో విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలు అట్టడుగు స్థానంలో ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. అనేక గ్రామాలకు ఇప్పటికీ రహదారులు లేవు. ఇదే కారణంతో కొమరాడ మండలం చోళ్లపదం పంచాయతీ, రెబ్బ గ్రామానికి చెందిన కోలక సోమయ్య తమ కుమార్తెను బతికించుకునేందుకు కోసం వెదురు కర్రలతో తయారుచేసిన నావపై నాగావళి నది దాటాల్సిన దుస్థితి ఏర్పడింది. ఆ ఒక్క గ్రామమే కాదు. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం చేపట్టకపోడంతో సుమారు 15గ్రామాల ప్రజానీకం ఆపదలోనూ దవాఖానాలకు వెళ్లాలంటే ప్రాణాలకు తెగించాల్సిన పరిస్థితి ఎదురౌతోంది. అటు సాలూరు మండలంలోని కొఠియా ప్రాంతంలోనూ ఇప్పటికీ ప్రభుత్వ పథకాలు అందని పరిస్థితి. ఓటు కార్డులు తప్ప, రేషన్‌కార్డులు, ఆధార్ కార్డులకు నోచుకోని కుటుంబాలెన్నో... వీరికి విద్య, వైద్య సదుపాయాలు అందకపోవడంతో ఇప్పటికీ పసరమందులే దిక్కుగా మారింది. ఇక రక్తహీనతతో తల్లీపిల్లల మరణాలు ఇటీవల ఎక్కువయ్యాయని అధికారుల సమీక్షలోనే ఇటీవల బయటపడింది. ఇప్పటికీ అంటరాని తనం, రెండు గ్లాసుల పద్ధతి అక్కడకక్కడా కనిపిస్తోంది. 76ఏళ్ల స్వాతంత్ర్య భారతంలో కొన్ని సామాజికవర్గాలు, పేదలు తమకు జరుగుతున్న అన్యాయాన్ని స్వేచ్ఛగా చెప్పుకునే పరిస్థితి కూడా లేదు. ప్రభుత్వ విధానాల కారణంగా గతం కన్నా దోపిడీ, అవినీతి పెరిగింది. మరోవైపు నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ఇటీవల పెరిగిన టమాటా ధరలే ఇందుకు తార్కాణంగా చెప్పుకోవచ్చు. ఇంకోవైపు నిరుద్యోగం పెరిగింది. వయసు మీరుతున్నా ఉద్యోగ అవకాశాలు లేకపోవడంతో చదువుకున్నవారి పరిస్థితి సైతం దుర్భరంగా మారుతోంది. ఇటీవల కాలంలో నిరుద్యోగులు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టడమే ఇందుకు నిదర్శనం.

ఇలా స్వాతంత్ర్య అనంతరం జిల్లా అభివృద్ధి చెందినప్పటికీ 76ఏళ్లకు తగ్గట్టు లేదనేది ప్రజాస్వామ్యవాదులు, అభ్యుదయ కాముకుల వాదన. సుదీర్ఘ స్వాతంత్ర్య పోరాట పటిమను, వీరుల త్యాగఫలాన్ని విస్మరిస్తూ కేవలం సభలు చేసి సంబర పడడంతో సరిపెట్టుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశ్రీ అన్నట్టు సాధిచిన దానితో సంతృప్తి చెంద కుండా, అదే విజయమనుకుంటే సరిపెట్టుకోకుండా ప్రగతి దారులకై... సమసమాజ నిర్మాణమే ధ్యేయంగా... సకల జనుల సౌభాగ్యమే లక్ష్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉంది.



రోడ్డు సౌకర్యం లేక డోలీ కట్టి రోగిని కిందికి తీసుకొస్తున్న మారిక గిరిజనులు



ధర్నా చేస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు, బాధితురాలు

అధికారులు స్పందించకుంటే

హైకోర్టులో పిటిషన్ వేస్తాం

- పార్వతిని ఉద్యోగంలోకి తీసుకునే వరకు పోరాటం
- కలెక్టరేట్ వద్ద ధర్నాలో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు పాల్పడిన హెచ్‌ఆర్ విగ్నేష్‌పై పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేసారనే కారణంతో తొలగించిన బాధితురాలు పార్వతిని విధుల్లోకి తీసుకోవాలని, లేకుంటే హైకోర్టులో పిటిషన్ వేస్తామని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 70 ఏళ్ల స్వాతంత్ర్య చరిత్రలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. పూసపాటిరేగ మండలంలోగల విజయనగరం బయోటెక్ పరిశ్రమలో ఇనకోటి పార్వతి 2006 నుంచి పనిచేస్తున్నారని, ఆమెను హెచ్‌ఆర్‌గా పనిచేస్తున్న విగ్నేష్ లైంగికంగా వేధించాడని తెలిపారు. పని ప్రదేశంలో పై అధికారి వేధించడంతో యాజమాన్యం దృష్టికి ఆమె తీసుకెళ్లిందన్నారు. అయినా విగ్నేష్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో పోలీస్‌స్టేషన్లో బాధితురాలు ఫిర్యాదు చేసారన్నారు. కేసును ఉపసంహరించుకోవాలని యాజమాన్యం ఆమెపై ఒత్తిడి చేసిందని, కేసు ఉపసంహరించుకోక పోవడంతో 2021 ఏప్రిల్ 1న ఆమెను తొలగించారని తెలిపారు. ఉద్యోగం నుండి తొలగించడం అక్రమం, చట్టవ్యతిరేకమని గేటు వద్ద నిరసన తెలియజేస్తూ, లేబర్ డిపార్టు మెంటును న్యాయం కోసం ఆశ్రయించగా అదే నెల 24న ఉద్యోగం నుంచి తొలగించినట్లు లెటర్ పంపించారని వివరించారు. ఆమెను విధుల్లోకి తీసుకోవాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ అధికారులు రాత పూర్వకంగా తెలియజేసినా యాజమాన్యం స్పందించలేదని తెలిపారు. జెసిఎల్ ఒత్తిడితో శ్రీకాకుళం జిల్లాలోని ఇంకో పరిశ్రమలో చేరాలని లెటర్ ఇచ్చారన్నారు. తొలగించిన పరిశ్రమలోనే ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. వాస్తవానికి 2006 లో ఇక్కడ పరిశ్రమ స్థాపనకు ఆమె కుంటుంబం 3 ఎకరాలను యాజమాన్యానికి ఇచ్చి సహకరించారని, అందువల్లే ఆమెకు ఉపాధి వచ్చిందని తెలిపారు. వెంటనే కలెక్టర్ కలుగజేసుకొని విగ్నేష్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏ తప్పు చేయని పార్వతిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే హైకోర్టులో కేసు వేస్తామని తెలిపారు. ధర్నాలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.సుబ్బరావమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్, నాయకులు ఎ.జగన్మోహన్, కార్మికులు పాల్గొన్నారు.

యాప్ సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యాప్‌ల కారణంగా వస్తున్న సమస్యలను పరిష్కరిచాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు వి.లక్ష్మి తదితరులు సోమవారం కలెక్టర్‌కు వినతి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఇంటింటికీ పౌష్టికాహారం పంపిణీ విధానం అమలుకు కొత్తగా తీసుకొచ్చిన ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్‌లో వస్తున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. యాప్‌లపై కార్యకర్తలకు శిక్షణతో పాటు నాణ్యమైన ఫోన్లు ఇవ్వాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లకు రేషన్ డిపోల ద్వారా బియ్యం, పప్పు, నూనె 2022 సంవత్సరం నవంబర్ నెలవరకు మాత్రమే స్టాక్ వేశారని, డిసెంబర్ నుంచి అంగన్వాడీ కార్యకర్తలు రేషన్ డిపో దగ్గరికి వెళ్లి స్టాక్ తీసుకురావాల్సి వస్తుందని తెలిపారు. రవాణా ఛార్జీలకు కార్యకర్తల చేతి డబ్బులు పెట్టుకోవాల్సి వస్తుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ డిపోల ద్వారా నేరుగా అంగన్‌వాడీ సెంటర్లకు స్టాకు వేయాలని కోరారు. వినతినిచ్చిన వారిలో ఆ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.అనసూయ, అధ్యక్షులు బి.పైడిరాజు, గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి, అర్బన్ నాయకులు విశాలాక్షి, సుశీల ఉన్నారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న అంగన్వాడీ యూనియన్ నాయకులు

జగనన్నకు చెబుదాంకు 255 వినతులు

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి 255 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి, సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్, డిఆర్‌ఒ గణపతిరావు, ఆర్‌డిఒ సూర్యకళ, ఉప కలెక్టర్లు పద్మలత, సూర్య నారాయణ తదితరులు వినతులు స్వీకరించారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన సమస్యలపై 181, గ్రామ వార్డు సచివాలయం శాఖకు సంబంధించి 35, గృహ నిర్మాణం 10, డిఆర్‌డిఎ 9, జిల్లా పంచాయతీరాజ్ శాఖకు 10, పురపాలక శాఖకు 7, మిగిలినవి ఇతర శాఖలకు వినతులు అందాయి. స్పందన అనంతరం అసంతృప్తి వినతులపై కలెక్టర్ సమీక్షించారు. రెవెన్యూకు సంబంధించిన వినతులపై తహశీల్దార్, పోలీసుశాఖ అధికారులు పరిష్కరించాలని ఆదేశించారు.

ఆక్రమణ నుంచి చెరువును కాపాడండి

విజయనగరం 43వ డివిజన్ పాల్‌నగర్ హనుమాన్ రెసిడెన్సీ పక్కన చెరువు 250 గజాల స్థలం ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని ఆ డివిజన్ కార్పొరేటర్ దాసరి సత్యవతి జిల్లా కలెక్టర్‌ను కోరారు. స్పందనకు వినతి అందజేశారు. తమ ఇంటి పక్కన గల చెరువు 250గజాల స్థలాన్ని పెదవేమలి గ్రామానికి చెందిన వేచలపు కృష్ణవేణి భర్త నాయుడు ఆక్రమించారని ఫిర్యాదు చేశారు.

ముగిసిన నామినేషన్ల ఉపసంహరణ

ప్రజాశక్తి-పూసపాటిరేగ

పంచాయతీ ఉప ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు సోమవారం ముగిసింది. గజపతినగరం మండలం లోగిశ సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. మిగతా చోట్ల పోటీ అనివార్యమైంది. పూసపాటిరేగ మండలంలోని కొప్పెర్ల పంచాయతీ ఉపఎన్నికకు ఏడు నామినేషన్లు దాఖలైన విషయం తెలిసిందే. సోమవారం ఐదుగురు సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. వైసిపి మద్దతుతో మాజీ సర్పంచి పైడి వెంకటరమణ భార్య పార్వతమ్మ, వైసిపి రెబల్ అభ్యర్థి సంకాబత్తుల సత్తిబాబు బరిలో నిలిచారు. పార్వతమ్మకు టిడిపి గ్రామ నాయకులు కూడా మద్దతు పలకడంతో ఆమె గెలుపుపై ధీమాగా ఉన్నారు. ఈసారి అవకాశం ప్రజలు తనకే ఇస్తారంటూ సత్తిబాబు చెబుతున్నారు.

రెండు స్థానాలు.. నలుగురు అభ్యర్థులు

వంగర : మండలంలోని లక్ష్మింపేట, ఓని అగ్రహారం సర్పంచ్ స్థానాలకు గాను నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపిడిఒ వి.శ్రీనివాసరావు తెలిపారు. లక్ష్మింపేటలో ఆవు సుజాత, వాన నారాయణమ్మ, ఓని అగ్రహారంలో మజ్జి గౌరీశ్వరి, కాబోతుల రుక్మిణమ్మ పోటీలో ఉన్నారు. రుషింగిలో వార్డ్ మెంబర్‌కు యలకల శ్రీనివాసరావు, యలకల రాము పోటీలో ఉన్నారు. కొట్టిశ, కొప్పరవలస, ఇరువాడలో ఒక్కొక్క వార్డు మెంబర్‌కు ఒక్కొక్క నామినేషన్ రావడంతో అక్కడ పోటీ లేకపోయింది. కొట్టిశలో పాలవలస వెంకటలక్ష్మి, కొప్పరవలసలో నర్జాన స్వప్న, ఇరువాడలో పెద్దింటి అప్పన్న వార్డు మెంబర్లుగా ఎన్నికయ్యారు.

గంట్యాడ : పెంటశ్రీరాంపురం పంచాయతీ ఉప ఎన్నికల్లో సర్పంచ్ బరిలో కరక గౌతమి, కరక రామయ్యమ్మ ఉన్నారు. గౌతమి వైసిపి మద్దతుతో, రామయ్యమ్మ టిడిపి మద్దతుతో బరిలో నిలిచారు. రెండో వార్డుకు గేదెల విజయ, బి.సూరీడమ్మ పోటీలో ఉన్నారు.

నెల్లిమర్ల : గుషిని పంచాయతీలో మూడో వార్డు సభ్యులుగా కోరాడ నారాయణరావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయనకు ఎంపిడిఒ గిరిబాల ధ్రువపత్రం అందించారు.

వేపాడ : మండలంలోని బొద్దాంలో ఎ.రమణమ్మ, సింగరాయిలో జి.ముత్యం, కెఆర్‌పేటలో ఎస్.అచ్చియ్యమ్మ, వల్లంపూడిలో ఇస్తరాపు శారద వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు.

గుర్ల : వల్లపురం, గొలగాం, దేవునికనపాకలో ఒక్కొక్క వార్డు సభ్యుల ఎన్నికకు ఒక్కొక్క నామినేషన్ రావడంతో ఎంపిడిఒ వారిని ఎన్నికల్లో విజేతలుగా ప్రకటించారు. వల్లపురం పంచాయతీలో నందా సుశీల, గొలగాంలో కరణం రమేష్, దేవునికనపాకలో కె.తాతప్పడు వార్డు సభ్యులుగా ఎన్నికయ్యారు.

రామభద్రపురం : రొంపల్లి పంచాయతీ ఏడో వార్డు మెంబర్ ఎన్నిక ఏకగ్రీవమైంది. ఊళ్ల సన్యాసమ్మ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైనట్లు ఎన్నికలాధికారి ప్రకటించారు.

లోగిశ సర్పంచ్‌గా అనూష

గజపతినగరం : మండలంలో లోగిశ పంచాయతీ సర్పంచ్‌గా కె.అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప ఎన్నికల్లో నాలుగు నామినేషన్లు రాగా, సోమవారం ముగ్గురు ఉపసంహరించుకున్నారు. దీంతో అనూష ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1, 5వ వార్డు సభ్యులుగా జి.గురునాయుడు, కె.చిన్నయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సంక్షేమ హాస్టళ్లకు జిసిసి సబ్బులు సరఫరా చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిసిసి సబ్బులను ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలకు, కెజిబివిలకు అందించి, కార్మికులకు ఉపాధి భద్రత కల్పించాలని సిఐటియు నాయకులు గిరిజన సంక్షేమశాఖా మంత్రి రాజన్నదొరను కోరారు. గిరిజన విద్యాసంస్థలు, గురుకులాలు, హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు జిసిసి ద్వారా సబ్బులు అందించాలనే సదుద్దేశంతో అరకు, విజయనగరం లో జిసిసి సోప్ యూనిట్లు ఏర్పాటు చేశారని, 20ఏళ్లగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నామని తెలిపారు. వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అమ్మ ఒడి, కాస్మోటిక్ ఛార్జీలను నేరుగా అకౌంట్స్‌లో వేయడంతో జిసిసి సబ్బుల వినియోగం తగ్గిందని , దీంతో 2023 జనవరి నుంచి సరిగ్గా పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. వినతిపత్రం వచ్చిన వారిలో జిసిసి సోప్ యూనిట్ వర్కర్స్ యూనియన్, విజయనగరం, అరకు ప్రతినిధులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం

ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఎం.దీపిక తెలిపారు. సోమవారం స్పందనలో 35 వినతులు స్వీకరించారు. అనంతరం సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సు లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని, ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు.

బీచ్‌ల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో బీచ్ పర్యటకానికి మహర్దశ పట్టనుంది. సముద్ర తీర ప్రాంతంలో బీచ్‌ల అభివృద్ధికి ప్రభుత్వం నిర్ణయించింది. కోస్తా మండలి యాజమాన్య ప్రణాళిక - 2019 (సిజెడ్‌ఎంపి) లో భాగంగా భోగాపురం, పూసపాటి రేగ మండలాల్లో పలు బీచ్ లను పర్యాటకాభివృద్ధికి ఎంపిక చేసేందుకు గాను, జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశం సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ రెండు మండలాల్లో బీచ్ లను అభివృద్ధి చేసేందుకు వివిధ గ్రామాల ఎంపికపై చర్చించారు. భోగాపురం మండలంలో 7, పూసపాటి రేగ మండలంలో 6 గ్రామాలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. సముద్ర తీరాన్ని అభివృద్ధి చేయడం వల్ల పర్యాటకుల సంఖ్య పెరుగుతుందని అన్నారు. పారిశ్రామిక అభివృద్ధిని కూడా దృష్టిలో పెట్టుకొని, దీనికి విఘాతం కలగకుండా మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. సముద్రతీర గ్రామాల్లో ప్రభుత్వ భూములను సేకరించి, ఇందుకు కేటాయించాలని కోరారు. వివిధ మత్స్యకార గ్రామాల సర్పంచ్ లు, ఎంపిటిసిలు మాట్లాడుతూ, తమ గ్రామాల బీచ్ లను పర్యటకాభివృద్ధికి ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు. తమ గ్రామాల్లోని సమస్యలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, టూరిజం ఆర్‌డి శ్రీనివాసరావు, జిల్లా పర్యాటక అధికారి పిఎన్‌వి లక్ష్మీనారాయణ, మత్స్యకార ఫెడరేషన్ అధ్యక్షులు బర్రి చిన్నప్పన్న, మెరైన్, అటవీ, పోలీసు శాఖల అధికారులు, సర్పంచులు, గ్రామ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

24న మున్సిపల్ కార్మికుల 'చలో విజయవాడ'

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపడంతో ఈనెల 24న చలో విజయవాడ కార్యక్రమం చేపడుతున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ఆగస్టు 1 రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్ల ముట్టడితో రాష్ట్ర ప్రభుత్వం దిగివచ్చి నాయకత్వంతో చర్చలు జరిపిందని, మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలును కొనసాగిస్తూ ఉత్తర్వులు వెంటనే ఇవ్వటానికి, ప్రమాదవశాత్తు, సహజ మరణం పొందిన కార్మికులకు 5 లక్షలు, 2 లక్షలు , దహన సంస్కార ఖర్చులు 5 వేలు నుంచి 15 వేలు ఇవ్వటానికి అంగీకరించిందని తెలిపారు. ప్రధానమైన పర్మనెంట్, సమాన పనికి సమాన వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఇంజనీరింగ్ కార్మికులకు రిస్క్ అలవెన్స్, టెక్నికల్ వేతనాలు, రామ్ తీర్థాలు నెల్లిమర్ల ముషిడిపల్లి పంప్ హౌస్ కార్మికులకు టర్న్‌కీ సిస్టం రద్దు తదితర డిమాండ్ల పరిష్కారం కాలేదని తెలిపారు. ఈనేపథ్యంలోనే చలో విజయవాడ చేపడుతున్నట్లు తెలిపారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పరేడ్ మైదానాన్ని పరిశీలించిన కలెక్టర్ నాగలక్ష్మి ● నేడు నగరంలో శకటాల ప్రదర్శన

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక పోలీస్ పెరేడ్ గ్రౌండ్ లో జరగనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ వేడుకలకు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిధిగా హాజరై, జాతీయ పతాకావిష్కరణ చేయనున్నారు. ఈవేడుకలను నిర్వహించే పెరేడ్ గ్రౌండ్‌ను జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి సోమవారం సాయంత్రం పరిశీలించారు. వేదికను, మైదానాన్ని, స్టాల్స్ ను పరిశీలించి పలు సూచనలు చేశారు. జిల్లా పంచాయతీ, గ్రామీణాభివృద్ధి సంస్థ, మత్స్యశాఖ, ఉద్యాన శాఖ, సర్వే మరియు భూ రికార్డుల శాఖ, చేనేత జౌళిశాఖ, జిల్లా నైపుణ్యాభివృద్ధి శాఖ, వైద్యారోగ్యశాఖ, వైద్యారోగ్యశాఖ, పశు సంవర్ధకశాఖ, సాంఘిక సంక్షేమశాఖ, ఐసిడిఎస్, సెట్విజ్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్దుల సంక్షేమశాఖలు స్టాల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. శకటాలను వాటికి కేటాయించిన నంబర్ల ప్రకారం నడిపించాలని, అత్యుత్తమంగా ఉన్న వాటికి బహుమతులు ఇచ్చి ప్రోత్సహించాలని సూచించారు. పరేడ్ గ్రౌండ్‌లో వేడుకల అనంతరం శకటాలను ప్రజల సందర్శనార్ధం నగరంలో పరేడ్ గ్రౌండ్ నుంచి మయూరి జంక్షన్ మీదుగా బాలాజీ జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించాలని ఆదేశించారు. వర్షం పడితే మైదానంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో చర్చించారు. వచ్చిన అతిధులతోపాటుగా సామాన్య ప్రజలకు కూడా కూర్చోవడానికి కుర్చీలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కలెక్టర్ వెంట ఎస్‌పి దీపికా పాటిల్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, ట్రైనీ కలెక్టర్ వెంకట త్రివినాగ్, డిఆర్‌ఒ ఎం.గణపతిరావు, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఎస్‌డిసిలు బి.సుదర్శనదొర, డి.వెంకటేశ్వర్రావు, మున్సిపల్ కమిషనర్ శ్రీరాములు నాయుడు, తాహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ర్యాలీ చేస్తున్న కళాకారులు, విద్యార్థులు

సమైక్యతా స్ఫూర్తిని చాటుతూ ప్రదర్శన

ఆజాద్‌కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా దేశ సమైక్యతను చాటుతూ జిల్లాలోని వివిధ రంగాలకు చెందిన కళాకారులు, విద్యార్థులు నగరంలో ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. నాభూమి - నాదేశం కార్యక్రమంలో భాగంగా మహారాజ ప్రభుత్వ సంగీత, నృత్య కళాశాల - సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. జాతీయ స్ఫూర్తిని చాటుతూ దేశభక్తి నినాదాలు చేస్తూ కళాకారులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. సంగీత కళాశాల వద్ద ప్రారంభమైన ర్యాలీ సింహాచలం మేడ, కోట జంక్షన్, గురజాడ స్వగహం, గురజాడ జంక్షన్ మీదుగా సాగింది. కార్యక్రమంలో మహారాజ ప్రభుత్వ సంగీత, నత్య కళాశాల ప్రిన్సిపాల్, ఇతర అధ్యాపకులు, కళాకారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు

విజయనగరం కోట : స్థానిక గాజులరేగ నారాయణ పబ్లిక్ స్కూల్‌లో ఒక రోజు ముందే శ్రీనివాస్ ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు ఆర్‌బి రామానాయుడు ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ స్వతంత్ర సమరయోధుల వేషధారణ వేయించి వారు స్వతంత్రం సాధించడంలో పోషించిన పాత్ర వారి గొప్పదనం, పోరాట పటిమ గురించి తెలియజేశారు. ఈ సందర్భంగా రామానాయుడు, స్కూలు కరస్పాండెంట్ మొయిద నారాయణరావు మాట్లాడుతూ స్వతంత్ర సమరయోధుల పాత్ర పోషించడం వల్ల ఆచరించేందుకు దోహద పడుతుందని అన్నారు.

ఆర్‌టిసిలో అంప్రెటీస్‌కు అవరోధాలు

- అయోమయంలో అభ్యర్థులు
- సమయం పొడిగించాలని విన్నపం

ప్రజాశక్తి-విజయనగరం కోట

సాంకేతిక (ఐటిఐ) విద్యార్థులకు 18 ట్రేడ్‌లలో అప్రెంటీస్‌లో శిక్షణ అందించేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి ఎపిఎస్ ఆర్‌టిసి జోనల్ వర్క్‌షాప్‌లోని స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.హిమబిందు కొన్ని రోజుల క్రితం దరఖాస్తులు కోరారు. అయితే అందుకు విద్యార్థులు నాటి నుంచి నేటి వరకు పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ కోనసీమ తూర్పుగోదావరి జిల్లాల అభ్యర్థులు వెబ్ సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. అయితే అభ్యర్థులు రోజుల తరబడి నెట్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్నా ఆన్‌లైన్ కాకపోవడం, ఆఫ్‌లైన్‌లో అధికారులు దరఖాస్తులు స్వీకరించకపోవడంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. కొందరు అభ్యర్థులు జోనల్ వర్క్‌షాప్, శిక్షణ కళాశాలకు వెళ్లి అధికారులను సమాచారం అడగ్గా వారు సరైన సమాధానం ఇవ్వకపోవడంతో అయోమయ పరిస్థితిలో ఉన్నారు. దీనికి తోడు ఆగస్టు 15వ తేదీతో ఆన్‌లైన్ గడువు ముగుస్తుండడంతో అభ్యర్థులు మరికొంత సమయాన్ని పొడిగించాలని, దరఖాస్తులను ఆర్‌టిసి స్టాఫ్ ట్రైనింగ్ కళాశాలలో స్వీకరించాలని కోరుతున్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలి

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకోవాలని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. సోమవారం మండలంలోని పక్కి గ్రామంలో నిర్వహించిన నా భూమి - నా దేశం కార్యక్రమంలో శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ముందుగా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విశ్రాంత సైనిక ఉద్యోగులను సత్కరించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ గంట పైడిరాజు, ఎంపిడిఒ రవికుమార్, ఎపిఒ రాజు, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్‌రావు పాల్గొన్నారు.

వేపాడ : మండలంలో బానాది, డిఆర్‌పేట, ఎన్‌కెఆర్ పురం గ్రామాల్లో నాభూమి-నాదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ వి.వి.చినరామునాయుడు, బానాది సర్పంచ్ కర్రి యశోద, ఎంపిటిసి గొంప తులసి, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్ పాల్గొన్నారు.

గరివిడి : పట్టణంలో జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నాభూమి-నాదేశం కార్యక్రమంలో భాగంగా జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్ మాజీ సైనికులను సత్కరించారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి వి.శ్రీనివాసరావు, ఎంపిపి మీసాల విజయలక్ష్మి , సర్పంచ్ పి.ప్రమీల, కొనిశ కృష్ణంనాయుడు, ఎఎంసి మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, ఎంపిడిఒ జి.భాస్కరరావు, ఎపిఒ కనకరాజు, బమ్మిడి అప్పలస్వామి, వలిరెడ్డి లక్ష్మణ, ముల్లు రాంబాబు, వైస్ ఎంపిపి జి.వి.శ్రీరాములునాయుడు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి-బొబ్బిలి

కాకినాడ రంగరాయ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ పూర్తి చేసిన వైద్య విద్యార్థి బి.సన్యాల్ యుజిలో జనరల్ మెడిసిన్‌లో ప్రథమ స్థానంలో నిలవడంతో డాక్టర్ శ్రీనివాసన్ ట్రస్ట్, కాకినాడ ఐఎంఎ ఆధ్వర్యాన గోల్డ్ మెడల్, ప్రశంస పత్రం అందజేసి అభినందించారు. సన్యాల్ ఎంబిబిఎస్ చదువుతున్న క్రమంలో ఎనిమిది గోల్డ్ మెడల్స్ సొంతం చేసుకున్నారు. గోల్డ్ మెడల్, ప్రశంస పత్రాన్ని వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఐవి రావు, ఐఎంఎ ప్రతినిధులు అందజేశారు. సన్యాల్ తండ్రి బి.మురళి పెరుమాళి ప్రాథమిక వైద్య కేంద్రంలో హెల్త్ ఎక్స్ టెన్షన్ అధికారిగా పని చేయగా తల్లి నాగమణి బొబ్బిలి సిహెచ్‌సిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పని చేస్తున్నారు.

ఆస్పత్రి వ్యర్థాల పరిశీలన

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని సింగవరం పంచాయతీలో చుక్కల చెరువులో ఆస్పత్రి వ్యర్థాలు వేయడంపై సోమవారం ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి జిల్లా పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు స్పందించారు. చెరువులో వేసిన వ్యర్థాలను పరిశీలించారు. దుర్వాసన వస్తుండటాన్ని గుర్తించారు. అనంతరం భోగాపురం మండలంలోని సుందరపేట సిహెచ్‌సికి అధికారులు చేరుకుని, సూపరింటెండెంట్ సునీల్‌కుమార్‌ను ప్రశ్నించారు. తనకు గాని, సిబ్బందికి గాని తెలియకుండా కాంట్రాక్టరు వేశారని, ఇకపై అలాంటి పొరపాట్లు జరగకుండా చూస్తానని చెప్పారు. వెంటనే ఆస్పత్రి వ్యర్థాలను తొలగించకుంటే, చర్యలు తప్పవని అధికారులు ఆయన్ను హెచ్చరించారు. వారితోపాటు సింగవరం ఇంజినీరింగ్ అసిస్టెంట్ వి.శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

రైతు డిపోలో ఎరువుల సీజ్

ప్రజాశక్తి-నెల్లిమర్ల

మొయిద నారాయణపట్నంలో ఎరువుల డిపోలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ బి.సింహాచలం సోమవారం తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందుల నిల్వలు, రికార్డులు పరిశీలించి, రూ.4,20,832 విలువైన ఎరువులు సీజ్ చేశారు. కార్యక్రమంలో ఎఒ ఎం.పూర్ణిమ, ఎఇఒ నాగరాజు, విఎఎ నిఖిల పాల్గొన్నారు.

బొబ్బిలిలో భారీ వర్షం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలిలో సోమవారం భారీ వర్షం కురిసింది. రెండ్రోజులపాటు కురిసిన వర్షంతో పంట పొలాల్లో నీరు చేరడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షం ఖరీఫ్ సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

బయట చెత్త వేయొద్దు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వసతిగృహాల్లో తడి, పొడి చెత్త బయట వేయవద్దని కమిషనర్ పి.బాలాజీ ప్రసాద్ సూచించారు. సోమవారం స్థానిక బాలికల గురుకులాన్ని సందర్శించారు. మిగులు పదార్థాలు, తడి, పొడి చెత్త నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పారిశుధ్య పనులు మెరుగ్గా నిర్వహించాలన్నారు. పొడి చెత్తను సేకరించి, నగర పంచాయతీ చెత్త వాహనానికి అందించాలని వైస్ ప్రిన్సిపల్ పి.శ్రీనివాస్, వార్డెన్ సుమలతకి సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ డి.ఉమాబాస్కర్ పాల్గొన్నారు.



ఓని అగ్రహారం గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి చక్రవర్తి

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి-వంగర

మండలంలోని లక్ష్మింపేట, ఓని అగ్రహారం పంచాయతీ ఉప ఎన్నికల నేపథ్యంలో ఆ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను చీపురుపల్లి డిఎస్‌పి శ్రీనివాస చక్రవర్తి సోమవారం పరిశీలించారు. గ్రామస్తులతో మాట్లాడి ఎన్నికల వేళ ఎవరూ తగాదాలకు పోకుండా శాంతియుతంగా మెలగాలని సూచించారు. కార్యక్రమంలో రాజాం రూరల్ సిఐ హెచ్.ఉపేంద్రరావు, వంగర ఎస్ఐ ఆర్.జనార్ధనరావు పాల్గొన్నారు.

18న న్యాయవాదుల దీక్ష

ప్రజాశక్తి-కొత్తవలస

కొత్తవలస జంక్షన్‌లో ఈ నెల 18న శాంతియుత నిరాహారదీక్ష చేయనున్నట్లు బార్ అసోసియేషన్ కార్యదర్శి ఎం.వి.ఎస్ గిరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులపై దాడులను వ్యతిరేకిస్తూ ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.

జాతీయ జెండాలతో ర్యాలీ

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని గొల్లపల్లి మున్సిపల్ పాఠశాల విద్యార్థులు జాతీయ జెండాలతో గ్రీన్‌బెల్ట్ సొసైటీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గ్రీన్ బెల్ట్ సొసైటీ అధ్యక్షులు ఎస్‌వి రమణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై జాతీయజెండా ఎగరాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి.రాజు ఆధ్వర్యంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపిపి కార్యాలయంలో ప్రారంభించారు. ముందుగా ఎంపిపికి జాతీయ జెండాను అందజేశారు. హర్ ఘర్ తిరంగా కార్యక్రమ ప్రాముఖ్యతను తెలియజేశారు. అనంతరం సిబ్బందికి, ప్రజలకు ఎంపిపి జెండాలను పంపిణీ చేశారు.

ఆహార పొట్లాలు పంపిణీ

ప్రజాశక్తి-బొబ్బిలి

నేనుసైతం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం పేదలకు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. పేదల ఆకలి తీర్చేందుకు 304 వారాల నుంచి ఆహార పొట్లాలు పంపిణీ చేస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వాసు, సంతోష్ తెలిపారు. మానవత్వంతో పేదలను ఆదుకోవాలని కోరారు.

అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

తంగుడుబిల్లి గ్రామానికి చెందిన చందక రామారావు ఆచూకీ లభ్యమైంది. విజయనగరంలో బాబామెట్ట ప్రాంతంలో ఉన్నట్లు గుర్తించిన బంధువులు సోమవారం ఇంటికి తీసుకువచ్చారు.

సచివాలయ వ్యవస్థతోనే గ్రామస్వరాజ్యం

హోంమంత్రి వనిత

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి సచివాలయ వ్యవస్థతో మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామస్వరాజ్యం సాకారమైందని రాష్ట్ర హోంశాఖా మంత్రి తానేటి వనిత అన్నారు. మండలంలోని చినబొండపల్లిలో రూ.42లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామసచివాలయ భవనాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం గ్రామంలో రోడ్‌షో నిర్వహించి ప్రజలనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర చరిత్రలో ఎంతో మంది ముఖ్యమంత్రులు మారినా, ఇంత పెద్దఎత్తున సంక్షేమ పథకాలు, అవినీతికి చోటులేకుండా ప్రజలఖాతాల్లో నేరుగా వేసిన చరిత్ర సిఎం జగన్‌మోహనరెడ్డిదేనని అన్నారు. కుల, మత, వర్గ బేధాలు లేకుండా పార్టీలకు అతీతంగా అర్హులైన అన్ని వర్గాల ప్రజలకు రూ.2లక్షల కోట్లుకు పైగా ఆర్థిక సహాయం అందించారని, వైసిపి ప్రభుత్వా నికి ప్రజల్లో వస్తున్న ఆదరణచూసి ఓర్వలేక ప్రతిపక్షాలు జండా, ఎజండాలేకుండా విమర్శిస్తు న్నాయని అన్నారు. పేదల తలసరి ఆదాయం పెరగడమేకాకుండా,



సచివాలయాన్ని ప్రారంభిస్తున్న హోంమంత్రి వనిత


రాష్ట్ర జిడిపి గణనీయంగా పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదేనని అన్నారు. ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాబోయే ఎన్నికల్లో తమ నాయకుడు మళ్లీ సిఎం కావడం ఖాయమని, ఇంతకు పదిరెట్లుగా సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నిలిపే సత్తా జగన్‌కు ఉందని అన్నారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు మాట్లాడుతూ తాము గెలిస్తే ప్రజలకు ఏమిచేస్తామో, రాష్ట్రాన్ని ఏవిధంగా అభివృద్ధి చేస్తామో చెప్పకుండా రాష్ట్రంలోని కుహనా ప్రతిపక్షాలు అన్ని ఏకమై వైసిపి ప్రభుత్వం మళ్లీ అధికారంలో రాకుండా చేయడమే తమ ప్రధాన లక్ష్యమని ప్రకటించడం సిగ్గుచేటని అన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గండి శంకరరావు, జెడ్‌పిటిసి బలగ రేవతమ్మ, ఎంపిపి మజ్జి శోభారాణి, వైస్‌ఎంపిపిలు సిద్ధా జగన్నాధరావు, బంకురు రవికుమార్, ఆత్మ చైర్మన్ వై.తిరుపతి రావు, పెదబొండపల్లి పిఎసిఎస్ చైర్మన్ తీళ్ల శివున్నాయుడు, నాయకులు మజ్జిచంద్రశేఖర్, భీమవరపు కృష్ణమూర్తి, బొమ్మి రమేష్, మడక విశ్వనాధం, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిచ్చు పెట్టేందుకే అసత్య ప్రచారాలు

ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

ప్రజాశక్తి-డెంకాడ

స్థానిక ఎన్నికల్లో గానీ, గ్రామ స్థాయిలో గానీ, పార్టీ కార్యక్రమాల్లో గానీ అంతా ఒక కుటుంబ సభ్యుల వలే మెలగుతున్న సమయంలో చూసి, ఓర్వలేని కొన్ని దుష్టశక్తులు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు వ్యాఖ్యానించారు. మండలంలోని పెదతాడివాడలో ప్రయివేటు కళ్యాణ మండపంలో ఏర్పాటుచేసిన సచివాలయ కన్వీనర్ల నియోజకవర్గ స్థాయి శిక్షణలో ఆయన మాట్లాడారు. ఇటీవల ఓ ఛానల్లో టిడిపిలోకి వెళుతున్నట్లు అసత్య ప్రచారానికి తెరదీశారని... వెంటనే ఛానల్ ఎమ్‌డికి ఫోన్ చేసి మాట్లాడితే తప్పిదం జరిగిందంటూ బదులిచ్చారన్నారు. పుకారులను పార్టీ శ్రేణులు నమ్మొద్దని కోరారు. అంతరించిపోయిన పార్టీలోకి తాను వెళతానని చెప్పడం హాస్యాస్పదమన్నారు. చంద్రబాబుది ఐరన్ లెగ్ అని, బాబు ఎక్కడికి వెళ్లినా.. అక్కడ ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తున్నాయన్నారు. బాబుతోపాటు దత్తపుత్రుడి ఉత్తరాంధ్ర పర్యటనలతో వర్షాలు ఆగిపోయాయన్నారు. వినాశకాలు ఆగాలంటే రానున్న వినాయక చవితి, దసరా పండగలకు గ్రామాల్లో సంప్రోక్షణ పూజలు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పార్టీ మారే అవసరం నాకేంటి?

బడ్డుకొండ అప్పలనాయుడు టిడిపివైపు చూస్తున్నారంటూ టీవీలో అసత్య కథనాన్ని అల్లారని, ఆ పార్టీలోకి వెళ్లే అవసరం తనకేమిటని ఎమ్మెల్యే వ్యాఖ్యానించారు. సిఎం ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గారి ఆశీస్సులు, మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ శ్రేణుల సహకారాలతో గత ఎన్నికల్లో 30 వేల భారీ మెజారిటీతో గెలిచిన తనకు వేరే పార్టీలోకి వెళ్లే అవసరం ఎందుకు వస్తుందన్నారు. టిక్కెట్ రాదంటూ మరికొంత మంది ప్రచారం చేస్తున్నారని, అది సిఎం జగన్మోహన్‌రెడ్డి ఇష్టమని స్పష్టంచేశారు. కొంతమంది బ్లాక్ మెయిల్ రాజకీయాలు చేస్తున్నారని, అలాంటివి ముఖ్యమంత్రి వద్ద సాగవని చెప్పారు. పదవులతో లబ్ధి పొందినప్పటికీ అసత్య ప్రచారాలు చేస్తున్నారని, పార్టీ శ్రేణులు గమనించాలని సూచించారు. అనంతరం జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్, వైసిపి నియోజకవర్గ పరిశీలకులు అంధవరపు సూరిబాబు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, జెడ్‌పిటిసిలు గదల సన్యాసినాయుడు, బడ్డుకొండ లక్ష్మి, నాయకులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి, మహంతి శ్రీనివాసరావు, పడాల భానుప్రకాశ్, నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బాడంగి

ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పరిపాలన కొనసాగిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. మండలంలోని వీరసాగరంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన చేపట్టారు. గడపగడపకు వెళ్లి నాలుగేళ్లలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందుతున్నాయా, లేదా అని ఆరాతీశారు. పథకాలకు ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులైన వారికి నేరుగా వాలంటీర్ల ద్వారా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తమదేనని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి పెద్దింటి రామారావు, జెసిఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

గడపగడపకూ కోలగట్ల

విజయనగరం టౌన్ : నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నం అంబేద్కర్ బొమ్మ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పాల్గొన్నారు. గడపగడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డికి మరోసారి అవకాశం ఇవ్వాలని కోరారు. స్థానిక సమస్యల పైన ఆరాతీసి వెంటనే వాటి పరిష్కారానికి అధికారులకు తగదేశాలు జారీ చేశారు. సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి ప్రస్తావించవచ్చని తెలిపారు. 29వ డివిజన్ పోర్ట్ సిటీ స్కూల్ నుండి ప్రారంభమైన గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో జోనల్ ఇన్చార్జులు కోలగట్ల కృష్ణారావు, ఈశ్వర్ కౌశిక్ పాల్గొన్నారు. రామకృష్ణ నగర్ తదితర ప్రాంతాలలో ఇంటింటికి వెళ్లి లబ్ధిదారులు పొందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బుక్లెట్లను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయాయాదవ్, వైసిపి నాయకులు ఈశ్వర్‌కౌశిక్ సహాయ కమిషనర్ ప్రసాదరావు, స్థానిక కార్పొరేటర్లు పొట్నూరు శ్రీనివాసరావు, మీసాల రమాదేవి, కోఆప్షన్ సభ్యురాలు పిల్లా పద్మావతి, మాజీ వైస్ చైర్ పర్సన్ లంక వరలక్ష్మి, పొట్నూరు పద్మ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

కొత్త ధర్మపురిలో నూతనంగా ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ను డిప్యూటీ స్పీకర్ వీరభద్ర స్వామి లాంచనంగా ప్రారంభించారు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో తీవ్రతరంగా ఉండే లోవోల్టేజ్ ను, ప్రజలు ఎదుర్కొంటున్న అవస్థలను గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పర్యటించిన సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కు తమ ఇబ్బందులను తెలియపరిచారు. వెంటనే స్పందించిన ఆయన ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

కేంద్ర ప్రభుత్వ తీరు మారకుంటే మరో స్వాతంత్ర్య పోరాటం

ప్రజాశక్తి-గజపతినగరం

ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ తీరు మారకుంటే మరో స్వాతంత్ర్య పోరాటానికి నాంది పలుకుతామని ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ హెచ్చరించాయి. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం గజపతినగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి మెంటాడ జంక్షన్ వరకు స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.సోమేశ్, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎన్.రుద్రప్రసాద్ మాట్లాడుతూ పాఠ్యపుస్తకాల నుంచి భగత్ సింగ్ వంటి స్వాతంత్ర్య సమరయోధుల పాఠ్యాంశాలను తొలగించడాన్ని తప్పుబట్టారు. తామే అసలైన దేశభక్తులమని చెప్పుకుంటున్న బిజెపి పాలకులు.. ప్రజలపై పెనుభారాలు మోపుతూ, మతఘర్షణలు సృష్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. స్వాతంత్ర్య ఫలాలను కొంతమంది పెట్టుబడుదారులకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు జయ, రమ, చిన్నారి పాల్గొన్నారు.



ర్యాలీ చేపడుతున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

మెప్మా అవినీతిపై దర్యాప్తు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-బొబ్బిలి

మెప్మాలో జరుగుతున్న అవినీతిపై మున్సిపల్ టిపిఆర్ఒ జగన్మోహన్ సోమవారం దర్యాప్తు నిర్వహించారు. పట్టణంలో డ్వాక్రా సభ్యుల నుంచి మెప్మా సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు 'ప్రజాశక్తి'లో సోమవారం వచ్చిన కథనంతో మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు టిపిఆర్ఒ దర్యాప్తు చేశారు. డ్వాక్రా సభ్యులతో మాట్లాడి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లింకేజీ రుణాల కోసం ఎవరికీ పైసా ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. డబ్బులు అడిగితే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు. దర్యాప్తు నివేదికను మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తామని చెప్పారు.

చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

మెప్మాలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిసిసి సభ్యులు ముమ్వల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. లంచం ఇవ్వలేదని రుణం డబ్బులు వెనక్కి తీసుకున్నారని ఆరోపణలు చేసిన సుంకర రమణమ్మను శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు కలిసి, మాట్లాడి వివరాలు సేకరించారు. ముమ్వల శ్రీనివాసరావు మాట్లాడుతూ లంచం ఎందుకని ప్రశ్నిస్తే రుణం డబ్బులు వెనక్కి తీసుకోవడం దుర్మార్గమన్నారు.

ఎంఆర్ కళాశాలను ఎయిడెడ్‌గా కొనసాగించాలని ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మహారాజా (స్వయం ప్రతిపత్తి) డిగ్రీ కళాశాల ప్రైవేటీకరణను ఆపాలని, కళాశాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కళాశాల వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష, కళాశాల కమిటీ నాయకులు డి.వెంకటరమణ మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం నిర్మించిన ఈ కళాశాల ఇప్పుడు ప్రైవేట్ పరమవుతుందని, ప్రైవేటీకరణ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. మౌలిక సదుపాయాలు లేకుండా ఫీజుల పెంపుపై ప్రశ్నిస్తే యాజమాన్యం దాడులకు దిగుతోందని అన్నారు. యథావిధిగా కళాశాలను ఎయిడెడ్ గా కొనసాగించి పేద విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ, నాయకులు రమేష్, లావణ్య, జగదీష్, సోమేష్ తదితరులు పాల్గొన్నారు.



గొంప వెంకటరావు, తులసి దంపతులకు, సామాజిక కార్యకర్త అప్పారావుకు కృతజ్ఞతలు చెబుతున్న విద్యార్థినులు

గురుకులంలో ముళ్లపొదలు తొలగింపు

గొంప వెంకటరావు దంపతుల ఉదారత

ప్రజాశక్తి-వేపాడ

టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, బానాది ఎంపిటిసి గొంప తులసి దంపతులు ఉదారత్వాన్ని చాటుకున్నారు. ఇటీవల మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకులాన్ని వారు సందర్శించారు. గురుకుల ఆవరణలో ఉన్న ముళ్లపొదల వల్ల ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు వారి దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కరిస్తామని వెంకటరావు దంపతులు హామీనిచ్చారు. అందులో భాగంగా సోమవారం ముళ్లపొదలను తొలగించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. దీంతో గురుకుల విద్యార్థినులు, సిబ్బంది.. గొంప వెంకటరావు దంపతులకు, సమస్య పరిష్కారానికి కృషి చేసిన సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

సాగునీరు అందడం లేదు

స్పందనలో రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండల కేంద్రం నుంచి ఆనందపురం జంక్షన్‌కు వెళ్లే రోడ్డులో బక్కునాయుడు చెరువుకు ఏర్పాటు చేసిన మధుములు వల్ల సుమారు 55 ఎకరాలకు సాగునీరు అందడం లేదని రైతులు.. స్పందనలో సోమవారం తహశీల్దార్ ప్రసన్నకుమార్‌కు వినతి అందించారు. దీంతో వెంటనే తహశీల్దార్ స్పందించి చెరువు వద్దకు చేరుకుని, మధుమును పరిశీలించారు. నీరు వెళ్లే అవకాశం లేదని నిర్ధారించి, ఆర్‌అండ్‌బి అధికారులకు తెలియజేశారు. పంట పొలాలకు సాగునీరు అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఆయన రైతులకు హామీనిచ్చారు. కార్యక్రమంలో వేపాడ, బికెఎన్‌పేట గ్రామాల నాయకులు ఎం.రమణ, సిహెచ్.దేవుడు, ఆర్ఐ రామలక్ష్మి, విఆర్ఒ బాలభాస్కర్, రైతులు పాల్గొన్నారు.

సెంచూరియన్‌కు 'నాక్ ఎ ప్లస్ '

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఒడిశాలోని సెంచూరియన్ యూనివర్సిటీ 'నాక్ ఎ ప్లస్' గుర్తింపు రావడం పట్ల ఛాన్సలర్ జిఎస్ఎన్ రాజు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో కేకు కట్ చేసి, వేడుకలు నిర్వహించారు. నాలుగు పాయింట్లకుగాను 3.37 పాయింట్లు సాధించి యూనివర్సిటీ 'నాక్ ఎ ప్లస్' లో నిలిచిందన్నారు. అనంతరం వైస్ ఛాన్సలర్ పి.కె.మహంతి మాట్లాడుతూ సెంచూరియన్ యూనివర్సిటీని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి, ఐక్యూఎసి డీన్ పిఎస్‌వి రమణారావు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆర్ఎస్ వర్మ, డీన్లు పుష్పలత, ఎంఎల్ఎన్ ఆచార్యులు, మురళి, సన్నీ డియోల్, సతీష్, అసిస్టెంట్ స్పోర్ట్స్ డైరెక్టర్ నారాయణ, అడ్మిషన్ టీం చిరంజీవి, వివిఎస్ ప్రతాప్ పాల్గొన్నారు.

జమ్ములో ఫ్లెక్సీ గొడవ

ప్రజాశక్తి-గుర్ల

మండలంలో జమ్ము గ్రామంలో ఫ్లెక్సీ వివాదం చినుకు చినుకు గాలివానలా మారింది. అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య వివాదం తలెత్తింది. నెల రోజుల క్రితం వైసిపి ఫ్లెక్సీలను టిడిపి కార్యకర్తలు చింపేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో గ్రామంలో వివాదం మొదలైంది. అంతకుముందు గ్రామంలో బెల్ట్‌షాపు విషయంలో గ్రామ సర్పంచ్‌కు, టిడిపి కార్యకర్తకు మధ్య వివాదం మొదలైంది. రెండు రోజుల నుంచి ఒకరినొకరు దుర్భాషలాడుకుంటూ గొడవలకు దిగారు. దీంతో ఇరుపార్టీల కార్యకర్తల మధ్య సోమవారం తోపులాట జరిగింది. పరస్పరం పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసుకున్నారు. ఈ విషయంలో తమ పార్టీ కార్యకర్తకు అన్యాయం జరిగిందంటూ టిడిపి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫ్లెక్సీలను చింపేయడమే కాకుండా తమపై దౌర్జన్యం చేస్తున్నారని వైసిపి శ్రేణులు ఆరోపిస్తున్నాయి. ఎస్ఐ హరిబాబు నాయుడు ఆ గ్రామానికి చేరుకుని, ఇరు పార్టీల నాయకులతో మాట్లాడి, వివరాలు సేకరించారు. టిడిపి కార్యకర్త జమ్ము భాస్కరరావుకు గాయాలు కావడంతో ఆస్పత్రిలో చేరాడు.

పంద్రాగస్టు సంబరాలు

బొబ్బిలి : ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జెఎసి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద పంద్రాగస్టు సంబరాలు నిర్వహించారు. ఈ నెల ఒకటో తేది నుంచి 15 వరకు ఈ సంబరాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు జన గణ మన జాతీయ గీతాన్ని ఆలపించారు. కార్యక్రమంలో ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్, జిల్లా అధ్యక్షులు అనిల్ కుమార్, నాయుడు యాదవ్, ప్రసాద్ కుమార్ పాల్గొన్నారు.